# మెట్రో బోగీలను పెంచాలి

- ప్రయాణికులకు సరిపడా ఆర్టీసీ బస్సుల సంఖ్యను రెట్టింపు చేయాలి
- ఎంఎంటీఎస్ లోకల్ రైళ్లనూ పెంచాలి
- సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమంలో నాయకుల డిమాండ్



రెజిమెంటల్ బజార్‌లో మెట్రో స్టేషన్ వద్ద బోగీలను పెంచాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టిన నాయకులు

మారేడ్‌పల్లి, ఆగస్టు 16: మెట్రో రైల్ బోగీలను 3 నుంచి 6కు పెంచాలని, ఆర్టీసీ బస్సుల సంఖ్యను రెట్టింపు చేయాలని, ఎంఎంటీఎస్ లోకల్ రైళ్లను పెంచాలని కోరుతూ సీపీఎం గ్రేటర్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రెజిమెంటల్‌బజార్‌లో కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ చేపట్టారు. సికింద్రాబాద్ జోన్ కమిటీ కార్యదర్శి ఎం.అజయ్‌బాబు మాట్లాడుతూ గ్రేటర్ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అదేస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదన్నారు. నగరంలో బస్సులు, ఎంఎంటీఎస్, మెట్రో రైళ్ల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నగరంలో మెట్రో రైలు మూడు బోగీలతోనే నడుస్తున్నదని, వాటిని ఆరు బోగీలకు పెంచాలని కోరుతున్నప్పటికీ మెట్రో రైల్ నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. మెట్రో రైలు బోగీల పెంపు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ నాయకులు వెంకటేశ్, రమేశ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

## పీజీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: ఓయూ పరిధిలోని వివిధ పీజీ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలి, కాలపరిమితి పూర్తైన వారికి కల్పించిన వన్‌టైమ్ చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎస్ డబ్ల్యూ, ఎంకామ్ (ఐఎస్), ఎంలిబ్ ఐఎస్సీ, బీలిబ్ఐఎస్సీ, ఎంసీజే, బీసీజే కోర్సుల్లో 2000 ఏడాది తరువాత చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫీజును వచ్చే నెల 28లోగా చెల్లించాలని సూచించారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 4గా చెల్లించవచ్చని చెప్పారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్ష విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షలు అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

### ఎమ్మెస్సీ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని ఎమ్మెస్సీ డేటా సైన్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.


నృత్య కిన్నెర ఆధ్వర్యంలో తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో హైమావతి, సంజన కూచిపూడి నృత్య ప్రదర్శన కనుల పండుగగా సాగింది.

## వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ కోదండరాం


ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: వచ్చే నెలలో జరుగనున్న వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్‌కు నిర్వాహకులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను ఆహ్వానించారు. తార్నాకలోని కోదండరాం నివాసంలో ఆయనను కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో వచ్చే నెల 14, 15 తేదీల్లో రెండో వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్‌ను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశాలకు అతిథిగా ఎమ్మెల్సీ కోదండరాంను ఆహ్వానించినట్లు వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ బోయిళ్ల విద్యాసాగర్, డాక్టర్ గోపాల్, దరువు ఎల్లన్న, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



బన్సీలాల్‌పేట్, ఆగస్టు 16: ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు శుక్రవారం చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు నిబంధనలు వివరించారు. ఆలుగడ్డబావి చౌరస్తా వద్ద పాదచారులు, వాహనదారుల భద్రత కోసం.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, జీబ్రా క్రాసింగ్ వద్ద వాహనాలను నిలిపాలని, రెడ్ సిగ్నల్ జంప్ చేయవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని వివరించారు. చిలకలగూడ ట్రాఫిక్ ఎస్సై కరుణాకర్, ఎస్పీ కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారులు కె.బాబు, టి.రాజేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# గాంధీలో వైద్యుల నిరసన ప్రదర్శన



గాంధీ దవాఖానలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న టీజీడీఏ వైద్యులు, పీజీ, జూడాలు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 16: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి, హత్య ఘటనను నిరసిస్తూ శుక్రవారం గాంధీ దవాఖానలో జూనియర్ డాక్టర్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. వారికి మద్దతుగా తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం, గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ భూపేందర్‌సింగ్ రాథోడ్, కార్యదర్శి డాక్టర్ అబ్బయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు. ఇలాంటి దుశ్చర్యను సభ్యసమాజం ఖండిస్తున్నదని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వర్షంలోనూ జూనియర్ వైద్యులు నినాదాలు చేస్తూ గాంధీ దవాఖాన నుంచి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. శనివారం దవాఖానలో వైద్య సేవలను నిలిపివేయాలని నిర్ణయించామని వారు తెలిపారు. మధ్యాహ్నం ఇందిరాపార్క్ వద్ద జరిగే భారీ ధర్నాలో పాల్గొంటామని వారు ప్రకటించారు.

## కోల్‌కతా ఘటనకు నిరసనగా ప్లకార్డుల ప్రదర్శన

బేగంపేట్, ఆగస్టు 16: కోల్‌కతాలో జరిగిన ఘటనలో జూనియర్ డాక్టర్ ఆత్మకు శాంతి కలగాలని సన్‌షైన్ ఎండీ డాక్టర్ గురువారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఘటనకు వ్యతిరేకంగా డాక్టర్లు, సిబ్బంది ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. గురువారెడ్డి మాట్లాడుతూ ఈ సంఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు బేగంపేట్‌లోని ఆసుపత్రిలో శనివారం శస్త్రచికిత్సలు, ఓపీడీ నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది, మహిళా వైద్యుల భద్రత కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు.


ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న సన్‌షైన్ ఆసుపత్రి వైద్యులు

## దవాఖానలో సమస్యలు పరిష్కరించాలి


గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిని కలిసిన నాయకులు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 16: గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారిని శుక్రవారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రామారావు, రాజశేఖర్, బాలకృష్ణ, జగదీశ్, మోహన్‌సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పద్మారావునగర్ వైపు ఉన్న మార్చ్యురీ నుంచి దుర్వాసనను అరికట్టాలని, దవాఖానకు వచ్చే రోగి సహాయకులకు పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. డయాగ్నస్టిక్ కేంద్రంలో మహిళలకు, పురుషులకు విడిగా లైన్‌లను ఏర్పాటు చేయాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు సదుపాయాలను మెరుగుపరచాలని వారు కోరారు. దానికి ఆమె సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## మహంకాళి అమ్మవారికి సాక సమర్పణ


అమ్మవారికి సాక సమర్పిస్తున్న మహిళలు

బేగంపేట్, ఆగస్టు 16: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి శుక్రవారం 108 బోనాలతో సాక సమర్పించారు. అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అమ్మవారిని, దేవాలయాన్ని గాజులతో అలంకరించారు. భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తగిన ఏర్పాట్లు చేశారు.



శ్రావణ మాస వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని శుక్రవారం బోయిన్‌పల్లిలోని నల్లపోచమ్మ ఆలయంలో జేఎమ్మార్ మహిళా సేన ఆధ్వర్యంలో మహిళలకు పసుపు కుంకుమ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మీనా భాస్కర్, అంబికా, సబిత, లక్ష్మి, అనిత, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు. – బొల్లారం



కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల 49లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేసినందుకు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ కలిసి పూలబొకేను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. – బొల్లారం

### మహిళ అదృశ్యం



కార్ఖాన్, ఆగస్టు 16 : ఓ మహిళ తప్పిపోయిన ఘటన టప్పాచబుత్రా పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ రాములు వివరాల ప్రకారం.. జాఫర్‌గూడలోని అన్నపూర్ణ ఆలయ సమీపంలో ప్రదీప్‌కుమార్ భార్య, ముగ్గురు పిల్లలతో నివసిస్తున్నాడు. ఈనెల 10న ప్రదీప్ ఇంటికొచ్చే సరికి స్వప్న ఫోన్‌లో మాట్లాడుతున్నది. గమనించిన భర్త భార్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫోన్ లాక్కుని బయటకు వెళ్లి తిరిగి రాత్రి ఇంటికొచ్చేసరికి భార్య కనిపించలేదు. ఆమె సమాచారం తెలువకపోవడంతో టప్పాచబుత్రా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై యాదయ్య తెలిపారు. ఆచూకీ తెలిస్తే 87125 68955లో తెలపాలని పోలీసులు కోరారు.

### మరో ఘటనలో..

టప్పాచబుత్రా పీఎస్ పరిధిలో యువకుడు తప్పిపోయిన ఘటన చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ రాములు వివరాల ప్రకారం.. ఎస్‌బీఐ కాలనీ వెంకటేశ్వర రెసిడెన్సీలో పది నెలలుగా ప్రశాంత్‌రెడ్డి అతడి సోదరుడు జైపాల్‌రెడ్డితో కలిసి నివసిస్తున్నారు. వీరి స్వస్థలం వికారాబాద్ జిల్లా మట్టిమీనపల్లి. ఈనెల 4న బయటకు వెళ్లిన ప్రశాంత్‌రెడ్డి రాత్రి అయినా రాలేదు. తన సోదరుడు జైపాల్ రెడ్డి టప్పాచబుత్రా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ యాదయ్య తెలిపారు.

# పాఠశాలకు కంప్యూటర్లు అందజేత

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 16: బోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు నాలుగు కంప్యూటర్లను తేరాపంత్ యువక్ పరిషత్ సభ్యులు అందజేశారు. విద్యార్థులకు డిజిటల్ తరగతుల నిర్వహణలో ఉపయోగ పడతాయని, విద్యార్థులు క్రమశిక్షణ, చిత్తశుద్ధితో చదువుకోవాలని తేరాపంత్ యువక్ పరిషత్ అధ్యక్షుడు అభినందన్ నహతా, కార్యదర్శి అనిల్ దుగర్ అన్నారు. పాఠశాలకు చేయూతనందించిన దాతలకు ప్రధానోపాధ్యాయురాలు స్వరూప విద్యార్థుల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు జీనెంద్ర బైద్, అరిహంత్ గుజ్రాని, రిశబ్ చిందాలియా పాల్గొన్నారు.


పాఠశాలకు కంప్యూటర్లు అందజేసిన తేరాపంత్ యువక్ పరిషత్ సభ్యులు

# వాజ్‌పేయికి ఘన నివాళి



రాజకీయాల్లో విలువలు పాటించిన వ్యక్తిగా దివంగత ప్రధాని వాజ్‌పేయిని ప్రపంచం గుర్తించిందని బీజేపీ సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగ్‌రావు పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ అధ్యక్షతన సనత్‌నగర్‌లో జరిగిన వాజ్‌పేయి 8వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటం వద్ద నాయకుల పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా లింగంపల్లి నర్సింగ్‌రావు మాట్లాడుతూ విపక్ష నేతగా ఉన్న వాజ్‌పేయిపై ఉన్న నమ్మకంతో అప్పటి ప్రధాని కీలకమైన ఐక్యరాజ్య సమితి సమావేశాలకు దేశం తరపున ప్రతినిధిగా పంపడం పరిశీలిస్తే, ఆయన పాటించిన రాజకీయ విలువలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దయానంద్, అమీర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు నక్కా శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మినారాయణ, కార్తీక వారణాసి తదితరులు పాల్గొన్నారు. – అమీర్‌పేట్

# నేర నియంత్రణకు సీసీకెమెరాలు దోహదం

## తిరుమలగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు

బొల్లారం, ఆగస్టు 16: తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్ బహదూర్ కాలనీవాసుల ఆధ్వర్యంలో 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా తిరుమలగిరి సీఐ నాగరాజు హాజరై మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన కాలనీవాసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ నరేందర్, ప్రధాన కార్యదర్శి తులసీ రాజన్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, వెంకట రమణ, డేవిడ్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి



ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసి ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారిని తక్షణమే తొలగించాలని కోరారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో డిపార్ట్‌మెంట్ హెడ్‌లు, ఇతర ఉన్నత స్థానాల్లో దాదాపు 1050 మంది పదవీ విరమణ చేసిన అనంతరం కూడా కొనసాగుతున్నారని ఆరోపించారు. వారికి వేతనాలు, ఇతర భత్యాల కింద నెలకు రూ.150 కోట్ల ప్రజా ధనం కేటాయించాల్సి వస్తోందని చెప్పారు. దాంతో పాటు అర్హులైన సీనియర్ ఉద్యోగులకు పదోన్నతులు దక్కకుండానే రిటైర్డ్ అవ్వాల్సిన దుస్థితి ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. టీఎస్ఏ నాయకులు రామ్‌కిషన్, మురళీకృష్ణ, రంజిత్ వర్మ, కార్తీక్ పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ పండరి పాండేకు ప్రతిష్ఠాత్మక అవార్డు



ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఐఈటీఈ) అందించే ప్రతిష్ఠాత్మక లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు 2024 సంవత్సరానికి గాను ఓయూ ఈసీఈ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వీఎం పండరి పాండేకు దక్కింది. ఆయన ఖరగ్‌పూర్ ఐఐటీతో పాటు ఓయూలో నాలుగు దశాబ్దాల పాటు పరిశోధకుడిగా, అధ్యాపకుడిగా సేవలందించారు. ఆయన తన పరిశోధన క్రమంలో 170కి పైగా పరిశోధన పత్రాలను వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. అలాగే ఐఈటీఈ అందించే ప్రొఫెసర్ శ్రీనివాసన్ మెమోరియల్ అవార్డు ఈ ఏడాదికి గాను ఓయూ ఈసీఈ విభాగానికే చెందిన ప్రొఫెసర్ నవీన్‌కుమార్‌కు దక్కింది.

## సీఎం రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలి



ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: సీఎం రేవంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేసి అమరవీరుల స్థూపం దగ్గర ముక్కు నేలకు రాయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఓయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ కరాటే రాజునాయక్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను వంద రోజుల్లో అమలు చేయలేదని మండిపడ్డారు. ఆగస్టు 15వ తేదీలోపు వంద శాతం రైతులకు రుణమాఫీ చేయనందున రేవంత్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. తెలంగాణ ప్రజలకు అలవి కాని హామీలిచ్చి, మోసం చేసి ఓట్లు దండుకున్నందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నైజమే మోసం చేయడమని దుయ్యబట్టారు. నిరుద్యోగులు రోడ్లపై ఆందోళన చేయాల్సిన పరిస్థితి తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.